పందిరి కర్రలకు గిరాకీ

- అలంకార సామగ్రిదీ అదే దారి
- మంచాల వీధిలోని కర్రల దుకాణం వద్ద ఒకటే రద్దీ



పందిళ్ల కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న యువకులు



సరుగుడు కర్రలు విక్రయిస్తున్న వ్యాపారులు

జగదాంబ: నియోజకవర్గంలో వినాయక చవితి పూజలకు యువత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఎక్కడ చూసినా పందిళ్లతో వీధులు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో అలంకార సామగ్రి ధరలు కొండెక్కుతున్నాయి. వినాయక పందిళ్లకు కావల్సిన రకరకాల క్లాత్‌లు, ప్లాస్టిక్ వస్తువులు, టోపీలు, చెక్కతో తయారు చేసే చక్రాలు ఇలా అన్ని వస్తువుల ధరలు కూడా పెరిగిపోయాయి. వీటి తయారీకి సంబంధించి వ్యాపారులు ముందుగానే పూర్ణామార్కెట్‌కు చేరుకుని క్షణం తీరిక లేకుండా పని చేస్తున్నారు. అలాగే పందిళ్లకు వాడే చెక్క, కర్ర సామగ్రికి కూడా విపరీతమైన గిరాకీ ఏర్పడింది.



డెకరేషన్ క్లాత్ కొనుగోలు చేస్తున్న యువకులు



అలంకార సామగ్రి దుకాణం

పందిరి కర్రలకు డిమాండ్..

పూర్ణామార్కెట్ దరి మంచాల వీధిలోని కర్రల దుకాణానికి పందిళ్ల నిమిత్తం యువత ఎక్కువగా వస్తున్నారు. పండగ నేపథ్యంలో వంద టన్నులకు పైగా సరుగుడు కర్రలు ఒక్కొక్కటి రూ. 500 చొప్పున అమ్మకాలు సాగిస్తే, కంట్రీ ఉడ్ రిఫర్లు అడుగు రూ. 500 చొప్పున యాభై టన్నుల వరకు అమ్మకాలు జరిగాయి.

డిమాండ్ పెరిగింది..



ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలు యువత పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. దీంతో మా వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. పందిరి కర్రలకు యువకులు మా షాపుకు వస్తున్నారు. వారు కోరిన సైజుల్లో కర్రలు కోసి ఇస్తున్నాం.

– సరకం ఆదినారాయణ, టింబర్ డిపో యాజమాని

అన్ని వస్తువులు ఒకే దగ్గర దొరుకుతాయి..



పందిళ్లకు అవసరమైన సామగ్రి అంతా పూర్ణామార్కెట్‌లోనే దొరుకుతుంది. అందుకే ఇక్కడికే వస్తాం. మంచాల వీధిలో కర్రలు, పందుపుల్లల సందులో హోల్‌సేల్‌గా డెకరేషన్ వస్తువులు, క్లాత్‌లు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేసుకోవచ్చు. దీంతో పెద్ద శ్రమ అనిపించదు. – రాజు, డాబాగార్డెన్స్,

అందమైన పందిళ్ల కోసం..



ధరలు ఎలా ఉన్నా వినాయక చవితి పందిళ్ల కోసం కావాల్సినవి కొనుగోలు చేయక తప్పదు. ఇవి పూర్ణామార్కెట్‌లో తప్ప మరెక్కడా దొరకవు. మనకు కావాల్సిన విధంగా పందిరి రూపుదిద్దుకోవాలంటే ఇవన్నీ ఉండాల్సిందే. అప్పుడే పందిళ్లు చూడడానికి బాగుంటాయి.

– జగదీష్, ఆరిలోవ

కొలువుదీరనున్న గణపయ్య

గణేష్ ఉత్సవాలకు సర్వం సిద్ధం



నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో ఏర్పాటు చేసిన మండపం



దొండపర్తిలో సిద్ధం అవుతున్న వినాయకుడు

అల్లిపురం: ఈ నెల 7వ తేదీ శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్ణామార్కెట్, అల్లిపురంలోని నేరెళ్లకోనేరు, నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో ప్రతి ఏడాది విభిన్న రూపాల్లో గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా అనుమతులు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకుల ఫోన్ నంబర్లు, పోలీసు వారు ఇచ్చిన క్యూఆర్ కోడ్, ఫైర్, కరెంట్ విభాగాలతో పాటు అత్యవసర సరీ్వసుల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని తెలిపారు.

దొండపర్తిలో..

సీతమ్మధార: దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో గతనెల నుంచి ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఈ ఉత్సవాలు నిర్వహించడం ఇది ఐదవ ఏట అని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో తయారు చేయించిన వినాయకుడి విగ్రహం ఇక్కడ ప్రతిష్ఠిస్తామని నిర్వాహకులు తెలిపారు. శివపార్వతులతో కూడిన వినాయక ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు, సాము గరిడి ఉంటాయని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఇనుప రాడ్లతో పందిరి నిర్మించారు.

గత 19 సంవత్సరాలుగా..



గత 19 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఒక విభిన్న రూపంలో గణపతిని నెలకొల్పి ఉత్సవాలు చేపడుతున్నాం. ఈ ఏడాది కూడా గణపతిని ప్రత్యేక రూపంలో ఏర్పాటు చేస్తున్నాం.

– భీశెట్టి గోపీకృష్ణ, శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్

క్లుప్తంగా

సేవామూర్తి మదర్ థెరిసా



మదర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోలా గురువులు తదితరులు

దాబాగార్డెన్స్: సేవామూర్తి మదర్ థెరిసా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కొనియాడారు. మదర్ థెరిసా వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు బోని శివరామకృష్ణ నేతృత్వంలో కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఐల్యాండ్‌లోని విగ్రహానికి కోలా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనాథ పిల్లలను చేరదీసి మానవత్వానికి మరణం లేదని చాటి చెప్పిన మాతృమూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ మార్కండేయలు, నీలాపు శ్రీను, గణేష్ కొండంగి, కోనదేవ, శ్రీనివాస్, నేదూరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళిక



మాట్లాడుతున్న మైలపల్లి లక్ష్మణరావు

మహారాణిపేట: మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఫిషింగ్ హార్బర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వాల సహకారంతో మత్స్య పరిశ్రమకు జవసత్వాలు కల్పిస్తామని, ప్రతి ఆపరేటర్, మత్స్యకారుని సంక్షేమానికి గట్టి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర మరపడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు , రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, మర పడవల సంఘం నూతన ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.


పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని కోరుతూ సెక్యూరిటీ గార్డులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్- అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణం జీతాలు చెల్లించాలని కోరారు. జీతాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్‌ను పిలిచి తక్షణం జీతాలు ఇవ్వాలని సూపరింటెండెంట్ తెలపగా రెండు నెలల పెండింగ్ జీతాలు చెల్లించడంతో గార్డులు ఆందోళన విరమించారు. యూనియన్ నాయకులు ఎ.శంకర్, బి.ధనలక్ష్మి, ఎం.భవానీ తదితర 20 మంది పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై రాష్ట్రస్థాయి సదస్సు

అల్లిపురం: ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధమేనా? అనే అంశంపై గురువారం రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ లా మాజీ డీన్, దక్షిణ భారత సిద్ధాంతకర్త గాలి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరిబాబు, రాజేంద్ర, రేణుకుమార్, వేణుగోపాల్, అన్నవరం పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ



ప్రతిమలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమణమూర్తి

జగదాంబ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన స్వామి వివేకానంద సంస్థలో 500 మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. టి.కృష్ణ, సంస్థ సభ్యులు నల్లరాజు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించరాదు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం రేసపువానిపాలెంలో ఉన్న కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టులో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్-1 పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో మరొకటి జరిగాయన్నారు. వీటికి సంబంధించి వివరణ ఇవ్వాలని డీఎంహెచ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీఐవో) డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి.ఉష, గైనకాలజిస్టులు డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, డాక్టర్ ఆర్.డి.ఎన్.శ్వేత, కేజీహెచ్ ఎనస్తీషియా డాక్టర్ టి.వి.శ్రీకృష్ణ, జనరల్ మెడిసిన్ డాక్టర్ బి.వర్ణిక, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారులు జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంగిరీజువీధి యూపీహెచ్‌సీ సందర్శన..

డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం రంగిరీజువీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కేజీహెచ్‌లో గల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హాస్టల్‌ను సందర్శించి డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని, దోమల మందు స్ప్రే చేయించాలని జిల్లా మలేరియా అధికారికి సూచించారు. ఈ పర్యటనలో యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే పర్యావరణానికి రక్ష

అల్లిపురం: మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్ష అని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ కొనరాజు స్వతంత్రకుమార్ అన్నారు. బంగారు మెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం కార్యదర్శి బీశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం సమాజం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ద్వారకా నగర్ అధ్యక్షుడు పాలమరశెట్టి లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీజీ ప్రసాదరావు, బుద్ధ వెంకటరావు, కోఆర్డినేటర్ కొణతాల సత్యనారాయణ, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ రూ. లక్ష విరాళం

అల్లిపురం: విజయవాడ వరద బాధితులకు సీపీఐ విశాఖ జిల్లా తరపున తొలి విడతగా రూ. లక్ష విరాళంగా రాష్ట్ర పార్టీకి పంపామని జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు తెలిపారు. గురువారం పూర్ణామార్కెట్‌లో విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎం. మన్మథరావు, ఎస్‌కే రెహమాన్, అత్తిలి విమల, నాయకులు ఎండీ బేగం, బి.పుష్పలత, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శం కేరళ వామపక్ష ప్రభుత్వం

అల్లిపురం: దేశానికి కేరళ వామపక్ష ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలవడానికి మార్క్స్ ఎంజిల్స్ చూపిన మార్గమే కారణమని కేరళ మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కె.కె. శైలజ టీచర్ తెలిపారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సీపీఐ జిల్లా కమిటీ కేరళ వామపక్ష ప్రభుత్వం- ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రజలను కలుపుకుని ముందుకు వెళ్తుందన్నారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, బి.జగన్, బొట్టా ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గురుదేవోభవ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, ప్రేమసమాజం కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఏవీఎన్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉన్న బంధాన్ని వివరిస్తూ వారి శ్రేయస్సుకు కృషి చేస్తామన్నారు. కృష్ణకుమారి, పైడి రజని, జి. శంకరనారాయణ, స్వరాజ్యలక్ష్మి, గాంధీ, ఇందిర, రాంకుమార్ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ప్రేమసమాజంలో..

ప్రేమసమాజం కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఉపాధ్యాయులను బ్యాంక్ ఆఫ్ బరోడా సిరిపురం బ్రాంచ్ సిబ్బంది ఘనంగా సత్కరించింది. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్దా శివాజీ, స్కూల్ కమిటీ చైర్మన్ ఉప్పల భాస్కరరావు, కార్యదర్శి కె. హరిమోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు పి. గణపతిరావు, ఎస్. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం..

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి పాల్గొని ఎంజీఎం హైస్కూల్ ఉపా.ధ్యాయులతో పాటు జిల్లావ్యాప్తంగా 27 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రవి గొడ్డేటి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వినయ్‌గాంధీ, సెక్రటరీ మణిమాల, ఎంజీఎం హైస్కూల్ హెచ్‌ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం, సభ్యులు జగన్, షాలిని, తిమ్మయ్యగాంధీ, మొదంబిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకమహాలక్ష్మి మిగిలిన ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

32వ వార్డులో..

32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నేరెళ్లకోనేరులో టూటౌన్ సీఐ బెండు తిరుమలరావు 40 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శాలివాహన, అడ్వకేట్ నారాయణరెడ్డి, కందుల కృష్ణ, రాజశేఖర్, ఆదిబాబు, కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సత్కారం..

అల్లిపురం: నేరెళ్లకోనేరులో గల అంగన్‌వాడీ కేంద్రం టీచర్ మంగరాజును ఆశ వర్కర్లు, ఆయాలు, తల్లిదండ్రులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాల్యం కేంద్రంలో..

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని సీబీఎం దొండపర్తి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గుడివాడ రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. జీవీఎంసీ బాల్యం కేంద్రాల నిర్వహణలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఆవుపాటి మోహన్‌కుమార్‌ను అభినందించారు.



మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు




జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు



అంగన్‌వాడీ టీచర్ మంగరాజును సత్కరిస్తున్న తల్లిదండ్రులు, ఆశ వర్కర్లు

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ గాది శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల సంస్థ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు. సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సంస్థ అధ్యాపకులను శ్రీధర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంజీఎం హైస్కూల్ ఉపాధ్యాయులతో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తి

ఆస్తి, చెత్త పన్ను రద్దు చేయాలి



మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న బాణాల

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో విలువ ఆధారిత ఆస్తి పన్ను, చెత్తపై యూజర్ చార్జీల రద్దుతో పాటు ఆస్తి పన్ను తగ్గింపు అంశాలను కౌన్సిల్ సమావేశంలోని అజెండాలో పొందుపరచాలని వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు కోరారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిని ఆమె చాంబర్‌లో గురువారం కలిసిన ఆయన అజెండాలో చేర్చాల్సిన అంశాలపై వినతిపత్రం అందించారు. కూటమిలో ఉన్న టీడీపీ. జనసేన, బీజేపీ నేతలు.. ఆస్తిపన్నుతో పాటు చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన విషయాన్ని బారాల గుర్తు చేశారు.

8న 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం

మహారాణిపేట: జీవీఎంసీ 37వ వార్డు సచివాలయం (ఏవీఎన్ కళాశాల ఎదురుగా)లో ఈ నెల 8న హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం నిర్వహించనున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న 9 నుంచి 14 ఏళ్ల లోపు బాలలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ మొదటి డోస్ ఇచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం లోపు బూస్టర్ డోస్ వేయాల్సి ఉందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కేజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.